క్లుప్తంగా

వార్తలు రాస్తే కేసులు పెడుతారా?

బెజ్జూర్: ఆంధ్రప్రదేశ్‌లో కల్తీ మద్యం విక్రయాలపై వార్తలు రాసిన 'సాక్షి' పత్రిక ఎడిటర్ ధనుంజయరెడ్డితో పాటు రిపోర్టర్లపై ఏపీ పోలీసులు కేసులు నమోదు చేయడాన్ని తీవ్రంగా ఖండిస్తున్నామని తుడుందెబ్బ రాష్ట్ర ఉపాధ్యక్షుడు సోయం చిన్నయ్య అన్నారు. వార్తలు రాసినందుకు కేసులు పెడతారా? ఇదెక్కడి ప్రజాస్వామ్యం అని ప్రశ్నించారు. ప్రజా సమస్యలను వెలుగులోకి తీసుకువచ్చే పాత్రికేయులపై అక్రమంగా కేసులు పెట్టడం ప్రజాస్వామ్య విలువలకు విరుద్ధమన్నారు. ఆంధ్రప్రదేశ్ ప్రభుత్వం కక్షసాధింపు చర్యలు మానుకోవాలని, వెంటనే కేసులు ఎత్తివేయాలని డిమాండ్ చేశారు.

విద్యార్థులకు ప్యాడ్లు పంపిణీ

కాగజ్‌నగర్ టౌన్: కాగజ్‌నగర్ మండలంలోని గన్నారం ట్రైబల్ రెసిడెన్షియల్ వెల్ఫేర్ కళాశాలలోని విద్యార్థులకు పరీక్ష ప్యాడ్లు ఈజ్‌గాం పోలీసుల ఆధ్వర్యంలో శుక్రవారం అందజేశారు. ఈ సందర్భంగా రూరల్ సీఐ నాగరాజు మాట్లాడుతూ.. విద్యార్థులు ఉన్నత స్థానాలకు ఎదగాలన్నారు.

36వ రోజుకు సమ్మె



సమ్మె చేస్తున్న వర్కర్లు

ఆసిఫాబాద్‌రూరల్: తమ సమస్యలు పరిష్కరించాలని కోరుతూ గిరిజన ఆశ్రమ హాస్టళ్లలో పనిచేసే డైలీ వైజ్ వర్కర్ల కలెక్టరేట్ ఎదుట చేస్తున్న సమ్మె శుక్రవారం 36వ రోజుకు చేరింది. సీఐటీయూ వివిధ సంఘాల నాయకులు కృష్ణమాచారి, ప్రభాకర్, వసంత్ రావు, కోటయ్య, భరత్, వర్కర్లు శశికళ, దివ్య, లక్ష్మి, గంగుబాయి, ప్రమీల, తిరుపతి, దివ్య, మాన్కుబాయి తదితరులు పాల్గొన్నారు.

అంబులెన్స్‌లో ప్రసవాలు

వాంకిడి: మండలంలోని ఘాట్ జనగాం, ఖేడేగాం గ్రామాలకు చెందిన గర్భిణులు శుక్రవారం అంబులెన్స్‌లో ప్రసవించారు. వివరాలు ఇలా ఉన్నాయి.. ఘాట్‌జనగాం గ్రామానికి చెందిన జి.రేణుక, ఖేడేగాం గ్రామానికి చెందిన గేడం మారుబాయి అనే గర్భిణులు శుక్రవారం రాత్రి పురిటి నొప్పులతో బాధపడుతుండగా కుటుంబ సభ్యులు అంబులెన్స్ సిబ్బందికి సమాచారం అందించారు. వేకువజామున వాంకిడి, ఆసిఫాబాద్ 108 సిబ్బంది ఆయా గ్రామాలకు వెళ్లి వారిని తరలించారు. మార్గమధ్యలో గర్భిణులకు పురిటి నొప్పులు అధికమవడంతో పురుడు పోశారు. జి.రేణుకకు ఆడ శిశువుకు మారుబాయి మగ శిశువుకు జన్మనిచ్చింది. తల్లీబిడ్డలను వాంకిడి ప్రభుత్వ ఆసుపత్రికి తరలించినట్లు సిబ్బంది తెలిపారు. ఈఎంటీలు ఎనగంటి ప్రవీణ్, నేరెల్ల శంకర్, పైలట్లు నాగార్జున, విలాస్ ఉన్నారు.

కొనసాగుతున్న వనమహోత్సవం

ఆసిఫాబాద్: జిల్లా కేంద్రంలోని మున్సిపాలిటీ ఆధ్వర్యంలో వనమహోత్సవ కార్యక్రమం కొనసాగుతోంది. జన్కాపూర్‌లో శుక్రవారం అదనపు కలెక్టర్ దీపక్ తివారి, ఆర్డీవో లోకేశ్వర్‌రావు మొక్కలు నాటారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ మొక్కలు నాటి వాటిని సంరక్షించాలన్నారు. మున్సిపల్ కమిషనర్ గజానంద్, సిబ్బంది పాల్గొన్నారు.

ముగిసిన యోగా శిక్షణ శిబిరం

వాంకిడి: మండల కేంద్రంలోని గిరిజన బాలికల ఆశ్రమ పాఠశాలలో ఆయుష్ ఆధ్వర్యంలో ఈనెల 15 నుంచి మూడు రోజుల పాటు నిర్వహించిన ఉచిత యోగా శిక్షణ శిబిరం శుక్రవారం ముగిసింది. యోగా ఇన్‌స్ట్రక్టర్ వడ్గురె దొడ్డాజీ ఆధ్వర్యంలో యోగాసనాలు, నిత్య జీవితంలో దాని ప్రాముఖ్యతపై హాస్టల్ విద్యార్థులకు శిక్షణ కల్పించారు. పాఠశాల వ్యాయమ ఉపాధ్యాయురాలు పెందూర్ మంగవతి, సిబ్బంది పాల్గొన్నారు.

'దాడి చేసిన వ్యక్తిని అరెస్టు చేయాలి'

కెరమెరి: సుప్రీంకోర్టు ప్రధాన న్యాయమూర్తి జస్టిస్ బీఆర్ గవాయ్‌పై దాడి చేసిన వ్యక్తిని అరెస్టు చేయాలని ఎమ్మార్పీస్ మండల ప్రధాన కార్యదర్శి కంబాల వినేష్ పేర్కొన్నారు. తహసీల్దార్ సంతోష్ కుమార్‌కు శుక్రవారం వినతిపత్రం అందించారు. ఆయన వెంట చందర్, ఆదర్శ్ తదితరులు ఉన్నారు.

దరఖాస్తుల ఆహ్వానం

ఆసిఫాబాద్‌రూరల్: జిల్లాలోని బెండార ప్రభుత్వ డిగ్రీ కళాశాలలో అతిథి అధ్యాపకుల నియామకం కోసం దరఖాస్తులు ఆహ్వానిస్తున్నట్లు ప్రిన్సిపాల్ కనకయ్య ఓ ప్రకటనలో తెలిపారు. డిగ్రీలో గణితశాస్త్రం బోధించుటకు అర్హత ఉన్న అభ్యర్థులు ఈనెల 21 లోపు దరఖాస్తు చేసుకోవాలని సూచించారు. అర్హత పీజీలో 55 శాతంతోపాటు (నెట్, సెట్) అర్హత కలిగిన వారికి ప్రాధాన్యత ఉంటుందని పేర్కొన్నారు.

అందని పశువైద్యం



మూగజీవాలకు టీకాలు ఇస్తున్న గోపాలమిత్ర (ఫైల్)

- లింగాపూర్‌లో పశువైద్యశాల కరువు
- పశువులకు గాలికుంటు, లంపీస్కిన్ వ్యాధులు
- చికిత్స కోసం సిర్పూర్(యూ)కు తరలింపు
- సకాలంలో అందక మృత్యువాత

మండలంలో 2018 లెక్కల ప్రకారం..

జీవాలు	ఆవులు	గెదేలు	మేకలు
సంఖ్య	10,381	704	8,600

లింగాపూర్: మండలంలో మూగజీవాలకు పశువైద్యం అందని ద్రాక్షగా మారింది. మండలంలో పశువైద్యశాల లేకపోవడంతో గ్రామాల్లో పశువులు గాలికుంటు, లంపీస్కిన్ తదితర వ్యాధుల బారినపడుతున్నాయి. రైతులు, కాపరులు వాటిని తీసుకుని సిర్పూర్(యు) పశువైద్యశాలకు వెళ్లి చికిత్స అందిస్తున్నారు. అక్కడికి వెళ్లాలంటే 14 కి.మీ ప్రయాణం చేయాల్సి వస్తుందని వాపోతున్నారు. ప్రైవేట్ వాహనదారులు అధిక చార్జీలు వసూళ్లు చేస్తున్నారని ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. జైనూర్, సిర్పూర్(యూ), లింగాపూర్ మండలాలకు ఒకే ఒక వైద్యుడు, మండలంలోని ఒకే ఒక్క గోపాలమిత్ర సిబ్బంది ఉన్నారు. సకాలంలో చికిత్స అందక పశువులు మృత్యువాత పడుతున్నాయి. దీంతో రైతులు, పశువుల కాపరులు తీవ్రంగా నష్టపోతున్నారు. అదేవిధంగా ఉమ్మడి రాష్ట్రంలో ప్రవేశపెట్టిన పశువుల బీమా పథకం 2016 వరకు కొనసాగింది. అప్పటి నుంచి పథకం అమలు చేయకపోవడంతో వారు నష్టపోతున్నారు. మండలకేంద్రంలో పశువైద్యశాల నిర్మించాలని పలువురు కోరుతున్నారు.

పశువైద్యశాల నిర్మించాలి



పశువులకు చికిత్స కోసం సిర్పూర్(యు) పశువైద్యశాలకు తీసుకెళ్తున్నాం. వాహనాలు దొరకక సకాలంలో వైద్యం అందక మృతిచెందుతున్నాయి. అధికారులు పశువైద్యశాల నిర్మించేలా చర్యలు చేపట్టాలి.
– రాథోడ్ కృష్ణ, పశుపోషకుడు, లింగాపూర్

ఏటా మూగజీవాలు చనిపోతున్నాయి



పశువులకు సరైన వైద్యం అందక మూగజీవాలు మృత్యువాత పడుతున్నాయి. గ్రామాల్లో ఏటా వర్షాకాలంలో 50 నుంచి 100 వరకు పశువులు, మేకలు వివిధ వ్యాధులతో చనిపోతున్నాయి.
– రాథోడ్ సురేశ్‌నాయక్, రైతు, లింగాపూర్

బురదమయంగా రోడ్డు



ఆసిఫాబాద్‌అర్బన్: జిల్లాకేంద్రంలోని జన్కాపూర్ హైటెక్ కాలనీకి వెళ్లే రహదారి గుంతలమయంగా మారింది. చిన్నపాటి వర్షానికే బురదగా మారడంతో రాకపోకలు సాగించే కాలనీవాసులు, వాహనదారులు ఇబ్బంది పడుతున్నారు. ఇప్పటికైనా సంబంధిత అధికారులు స్పందించి హైటెక్ కాలనీలోని రోడ్డును బాగు చేయాలని కాలనీవాసులు కోరుతున్నారు.

న్యాయవాదిని కఠినంగా శిక్షించాలి



ఆందోళన చేస్తున్న నాయకులు

కౌటాల: సుప్రీంకోర్టు ప్రధాన న్యాయమూర్తి జస్టిస్ గవాయిపై దాడికి పాల్పడిన న్యాయవాది రాకేశ్ కిశోర్‌ను కఠినంగా శిక్షించాలని శుక్రవారం మండల కేంద్రంలోని తహసీల్దార్ కార్యాలయం ఎదుట ఎమ్మార్పీఎస్ నాయకులు ఆందోళన చేపట్టారు. అత్యున్నత న్యాయస్థానంలో ప్రధాన న్యాయమూర్తిపై బూట్‌తో దాడి చేయడం సిగ్గు చేటన్నారు. దేశంలో సుప్రీంకోర్టు చీఫ్ జస్టిస్‌కే రక్షణ లేకపోవడం దారుణమన్నారు. మళ్లీ ఇలాంటి సంఘటనలు జరిగితే దేశవ్యాప్తంగా ఆందోళన కార్యక్రమాలు చేస్తామని హెచ్చరించారు. అనంతరం అధికారులకు వినతిపత్రం అందజేశారు. కార్యక్రమంలో పిట్టల సత్యనారాయణ, విఠల్, గొడిసేల రాజేశ్, దాసరి విఠల్, మానిక్‌రావ్, సుదర్శన్, పెద్ద నక్క శంకర్, తదితరులు పాల్గొన్నారు.

సీపీఆర్ చేసి ప్రాణాలు కాపాడవచ్చు



అవగాహన కల్పిస్తున్న 108 సిబ్బంది

బెజ్జూర్: అత్యవసర పరిస్థితుల్లో సీపీఆర్ చేసి ప్రాణాలు కాపాడవచ్చని 108 ఈఎంటీ మధుకర్ అన్నారు. శుక్రవారం మండల కేంద్రంలోని ప్రభుత్వ ఆసుపత్రిలో 108 సిబ్బంది ఆధ్వర్యంలో సీపీఆర్‌పై అవగాహన కల్పించారు. గుండెపోటు, విద్యుత్ షాక్, నీటిలో మునిగిపోవడం వంటి పరిస్థితుల్లో వెంటనే ఈ ప్రక్రియ ప్రారంభిస్తే ఫలితం ఉంటుందన్నారు. కార్యక్రమంలో బెజ్జూర్ ప్రభుత్వ ఆస్పత్రి మెడికల్ ఆఫీసర్ అన్విత, సిబ్బంది, 108 పైలెట్ మేడి సతీష్, 102 పైలెట్ తిరుపతి పాల్గొన్నారు.

దహెగాం: గుండెపోటు వచ్చిన వ్యక్తికి సీపీఆర్ చేయడం వల్ల ప్రాణాలు కాపాడుకోవచ్చని 108 జిల్లా మేనేజర్ మెరుగు నరేశ్ అన్నారు. శుక్రవారం మండల కేంద్రంలోని స్థానిక ప్రాథమిక ఆరోగ్య కేంద్రంలో సిబ్బందికి సీపీఆర్‌పై అవగాహన కల్పించారు. గుండెపోటు వచ్చిన వారికి ముందుగా సీపీఆర్ చేయాలని సూచించారు. ఆ వెంటనే సమీపంలోని ఆసుపత్రులకు తరలించాలన్నారు. అత్యవసర సమయంలో 108 కాల్ చేయాలన్నారు. కార్యక్రమంలో మెడికల్ టెక్నిషియన్ సుధాకర్, పైలెట్ కిష్టయ్య, సిబ్బంది పాల్గొన్నారు.

సిర్పూర్(టి): మండలంలోని హుడ్కిలి గ్రామంలో 108 జిల్లా మేనేజరు మెరుగు నరేశ్ ఆధ్వర్యంలో శుక్రవారం గ్రామస్తులకు సీపీఆర్‌పై అవగాహన కల్పించారు. హుడ్కిలి ప్రాథమిక ఆరోగ్య ఉపకేంద్రం సిబ్బంది శరణ్య, పద్మావతి, కృష్ణ, లోనవెల్లి పీహెచ్‌సీ వైద్య సిబ్బంది రాజలింగు, ఏఎన్‌ఎంల సమక్షంలో ప్రథమ చికిత్స ఎలా చేయాలో వివరించారు. సీపీఆర్‌తో ఎంతో మంది ప్రాణాలను కాపాడవచ్చని, ప్రతిఒక్కరూ అత్యవసర సమయాల్లో అప్రమత్తంగా ఉండాలన్నారు. కార్యక్రమంలో 108 టెక్నిషియన్ అజయ్, పైలెట్ చిరంజీవి, వైద్య సిబ్బంది పాల్గొన్నారు.

కెరమెరి: మండల కేంద్రంలోని ప్రాథమిక ఆరోగ్య కేంద్రంలో కెరమెరి 108 అంబులెన్స్ సిబ్బందికి, పీహెచ్‌సీ ఏఎన్‌ఎంలకు గుండెపోటు వచ్చినప్పుడు ఏ విధంగా సీపీఆర్ చేయాలో శుక్రవారం 108 జిల్లా మేనేజర్ మెరుగు నరేశ్ యాదవ్ అవగాహన కల్పించారు. మెడికల్ టెక్నిషియన్ షిండే రజినీకాంత్, పైలెట్ కొమురయ్య, తదితరులు ఉన్నారు.

'అరెస్టులతో ఉద్యమాన్ని ఆపలేరు'



కేంద్ర ప్రభుత్వం దిష్టిబొమ్మను దహనం చేస్తున్న సీపీఎం నాయకులు



దిష్టిబొమ్మను దహనం చేస్తున్న నాయకులు

ఆసిఫాబాద్‌అర్బన్: బీసీలకు 42శాతం రిజర్వేషన్ అమలు చేయాలని కోరుతూ చలో రాజ్‌భవన్ కార్యక్రమాన్ని నిర్వహించిన సీపీఎం నాయకులను పోలీసులు అరెస్టులు చేయడాన్ని నిరసిస్తూ శుక్రవారం సీపీఎం ఆధ్వర్యంలో జిల్లాకేంద్రంలో కేంద్ర ప్రభుత్వ దిష్టిబొమ్మను దహనం చేశారు. అనంతరం సీపీఎం జిల్లా కార్యదర్శి వర్గ సభ్యుడు శ్రీనివాస్ మాట్లాడుతూ బీసీలకు 42శాతం రిజర్వేషన్ అమలు కోసం తీసుకొచ్చిన జీఓ నం.9ని అమలు చేయాల్సిన అవసరం ఉందన్నారు. బీసీ రిజర్వేషన్‌లకు అన్ని పార్టీలు మద్దతు పలుకుతుంటే రిజర్వేషన్‌లకు అడ్డు పడుతున్నది ఎవరో ప్రజలు ఆలోచించాలన్నారు. ఇప్పటికైనా రాజకీయ పార్టీలు ద్వంద్వ వైఖరి వీడి బీసీలకు 42 శాతం రిజర్వేషన్ అమలయ్యేలా కార్యచరణ చేయాలని డిమాండ్ చేశారు. జిల్లా కార్యదర్శి వర్గ సభ్యులు దుర్గం దినకర్, జిల్లా కమిటీ సభ్యులు కార్తీక్, రాజేందర్, నాయకులు కృష్ణమాచారి, నిఖిల్, ప్రశాంత్ తదితరులు పాల్గొన్నారు.

కాగజ్‌నగర్ టౌన్: బీసీలకు 42 శాతం రిజర్వేషన్ కల్పించాలనే సీపీఎం రాష్ట్ర నాయకులు, కార్యకర్తలు రాజ్‌భవన్‌కు వెళ్లిన వారిని అక్రమంగా అరెస్టు చేయడం అన్యాయమని సీపీఎం నియోజకవర్గ కన్వీనర్ ముంజం ఆనంద్ కుమార్ అన్నారు. శుక్రవారం కాగజ్‌నగర్ పట్టణంలోని రాజీవ్‌గాంధీ చౌరస్తాలో కేంద్ర ప్రభుత్వ దిష్టిబొమ్మను దహనం చేశారు. కాంగ్రెస్ ప్రభుత్వం అధికారంలోకి వచ్చాక కులగణన నిర్వహించి 42 శాతం బీసీ రిజర్వేషన్ కల్పించడం కోసం రాష్ట్ర అసెంబ్లీలో తీర్మానం చేసి గవర్నర్, కేంద్ర ప్రభుత్వానికి నివేదిక సమర్పించిందన్నారు. బీజేపీ ప్రభుత్వం దొంగ నాటకం ఆడుతుందని ఆరోపించారు. కార్యక్రమంలో సీపీఎం నాయకులు జాడి మల్లయ్య, ఒట్ల రవి, చంద్రగిరి రాజన్న, మిట్టపల్లి సుదర్శన్, తదితరులు పాల్గొన్నారు.

మొక్కుబడిగా పోషణ మాసోత్సవం

కాగజ్‌నగర్ టౌన్: చిన్నారులు, గర్భిణులు, బాలింతలు, కిశోర బాలికల్లో పోషకాహార లోపాన్ని అధిగమించేందుకు ప్రభుత్వం నిర్వహిస్తున్న పోషణ మాసోత్సవం కాగజ్‌నగర్ ఐసీడీఎస్ పరిధిలో మొక్కుబడిగా ముగిసింది. గత నెల 17న ప్రారంభం కాగా.. ఈనెల 16న ముగిసింది. కాగజ్‌నగర్ ఐసీడీఎస్ పరిధిలో 173 అంగన్‌వాడీ కేంద్రాలు ఉన్నాయి. వీటన్నింటిలోనూ అంతంత మాత్రంగానే అవగాహన కార్యక్రమాలు నిర్వహించారు. గర్భిణుల ఆరోగ్య రక్షణ, రక్తహీనత నివారణ, పిల్లల పెరుగుదల పర్యవేక్షణ, పరిశుభ్రత వంటి పలు అంశాలపై అవగాహన కల్పించాల్సి ఉంది. బాలికలకు పోషకాహారం ప్రాముఖ్యత, పౌష్టికాహారం లేకపోతే ఎదురయ్యే రుగ్మతలపై అవగాహన కల్పించాలి. కానీ పూర్తిస్థాయిలో అన్ని కేంద్రాల్లో కార్యక్రమాలు నిర్వహించలేదన్న విమర్శలు వినిపిస్తున్నాయి. ఈ విషయమై కాగజ్‌నగర్ ఐసీడీఎస్ సీడీపీవో రేబాకను ఫోన్‌లో సంప్రదించగా అందుబాటులోకి రాలేదు.

భీం స్ఫూర్తితో పోరాడాలి



మాట్లాడుతున్న ఆదివాసీ నాయకులు

బెజ్జూర్: కుమురం భీం స్ఫూర్తితో ఆదివాసీల హక్కుల కోసం పోరాడాలని ఆదివాసీ నాయకులు అన్నారు. శుక్రవారం వారు మాట్లాడుతూ.. ఈనెల 20న బెజ్జూర్ మండల కేంద్రంలో ఆదివాసీ ర్యాలీ, సభ నిర్వహించడం జరుగుతుందన్నారు. షెడ్యూల్ ఐదు ప్రాంతాల్లో ఆదివాసీల స్వయం పాలనను తక్షణం అమలు చేయాలని, అడవులు, జలాలు, భూములపై ఆదివాసీల హక్కులను రక్షించాలని డిమాండ్ చేశారు. ప్రభుత్వాలు ఆదివాసీల భూములను, ఖనిజ సంపదలను బహుళజాతి కంపెనీలకు అప్పగిస్తుందని, వ్యతిరేకించిన వారిపై అక్రమ కేసులు పెడుతుందని ఆరోపించారు. ర్యాలీకి ఆదివాసీ పెద్దలు, గ్రామపటేళ్లు, ప్రజాసంఘాలు, ఉద్యోగ, ఉపాధ్యాయ సంఘాలు హాజరు కావాలని కోరారు. సమావేశంలో నాయకులు సిడం సకారాం, ఆత్రం బక్కయ్య, నైతం సత్తయ్య, ఆత్రం సాయి, తొర్రెం ప్రశాంత్, ఏనుక అమృత, తదితరులు పాల్గొన్నారు.

మెరుగైన వైద్య సేవలందించాలి

కాగజ్‌నగర్ టౌన్: ప్రభుత్వ నిబంధనల ప్రకారం సీనియర్ సిటీజన్లకు మెరుగైన వైద్యం అందించాలని సీనియర్ సిటీజన్స్ రాష్ట్ర కార్యదర్శి మార్త సత్యనారాయణ శుక్రవారం ప్రకటనలో కోరారు. లేవలేని స్థితిలో ఉన్న వారికి సంచార వాహనాల ద్వారా వైద్యం అందించాలన్నారు. వైద్య సిబ్బంది సీనియర్ సిటీజన్లకు సహకరించాలని కోరారు.

చిన్నారులకు పౌష్టికాహారం అందించాలి



అక్షరాభ్యాసం చేయిస్తున్న అధికారులు

కౌటాల: చిన్నారులకు పౌష్టికాహారం అందించాలని సీడీపీవో విజయలక్ష్మి అన్నారు. పోషణ మాసం కార్యక్రమంలో భాగంగా శుక్రవారం మండలంలోని కోయగూడ చిన్నారులకు అక్షరాభ్యాసం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ.. పిల్లలు ఆరోగ్యంగా ఉండాలంటే ఆకుకూరలు, చిరుధాన్యాలు తినిపించాలన్నారు. పిల్లలందరిని అంగన్‌వాడీ కేంద్రాలకు తరలించాలని సూచించారు. అంగన్‌వాడీ కేంద్రాల్లో అందించే సరుకులను సద్వినియోగం చేసుకోవాలన్నారు. కార్యక్రమంలో సూపర్‌వైజర్ కరుణ, శంకరమ్మ, హసీనా, హేమలత, తదితరులు పాల్గొన్నారు.

బంద్ విజయవంతం చేయండి



పోస్టర్ ఆవిష్కరిస్తున్న నాయకులు

కాగజ్‌నగర్ టౌన్: బీసీలకు 42 శాతం రిజర్వేషన్ కల్పించాలని నిర్వహించే బీసీ బంద్‌ను విజయవంతం చేయాలని పద్మశాలి నాయకులు కోరారు. శుక్రవారం పట్టణంలోని పద్మశాలి భవనంలో బంద్‌కు సంబంధించిన పోస్టర్ ఆవిష్కరించారు. రాష్ట్ర ప్రభుత్వం కులగణన చేసి బీసీలకు 42 శాతం రిజర్వేషన్ కల్పించాలని కోరినా.. కోర్టు జోక్యంతో నిలిపివేయడం జరిగిందన్నారు. బీసీలకు రావాల్సిన రిజర్వేషన్‌ను అడ్డుకోవడం సరైంది కాదన్నారు. బంద్‌కు అన్నివర్గాల వారు సహకరించాలన్నారు. కార్యక్రమంలో బీసీ నాయకులు డాక్టర్ కొత్తపల్లి శ్రీనివాస్, కొంగ సత్యనారాయణ, మార్త సత్యనారాయణ, తుమ్మ రమేశ్, సిందం శ్రీనివాస్, వెంకటేశం, తదితరులు పాల్గొన్నారు.

ఇందిరమ్మ ఇళ్ల నిర్మాణాలు పూర్తి చేయాలి



పనులను పరిశీలిస్తున్న ఎంపీడీవో

సిర్పూర్(టి): మండలంలోని గ్రామాల్లో ఇందిరమ్మ ఇళ్ల నిర్మాణాలను పూర్తి చేయాలని ఎంపీడీవో సత్యనారాయణ అన్నారు. శుక్రవారం మండలంలోని చింతకుంట, అచ్చెల్లి గ్రామ పంచాయతీలలో పర్యటించి ఇందిరమ్మ ఇళ్లను పరిశీలించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. లబ్ధిదారులు త్వరగా ఇళ్ల నిర్మాణాలు పూర్తి చేసి బిల్లులు పొందాలని సూచించారు. అనంతరం గ్రామాల్లో పర్యటించి డ్రైనేజీల్లో పూడిక తీయించాలని, పరిశుభ్రతపై ప్రత్యేక చర్యలు తీసుకోవాలని పంచాయతీ కార్యదర్శులకు సూచించారు. ఆయన వెంట పంచాయతీ కార్యదర్శులు శాలిని, మౌనిక ఉన్నారు.

ర్యాలీ విజయవంతం చేయండి

కాగజ్‌నగర్ రూరల్: ఈనెల 20న బెజ్జూరు మండలంలో నిర్వహించనున్న ఆదివాసీల ర్యాలీని విజయవంతం చేయాలని గోండ్వానా కోయ ఆదివాసీ సంక్షేమ సంఘం నాయకుడు సోయం చిన్నన్న శుక్రవారం ఒక ప్రకటనలో తెలిపారు. జల్ జంగల్ జమీన్ కోసం పోరాడిన కుమురం భీం 85వ వర్ధంతి సందర్భంగా ర్యాలీను నిర్వహించడం జరుగుతుందన్నారు. ఆదివాసీ సంఘాల నాయకులు, గ్రామపటేల్, బహుజన సంఘాలు, మహిళా సంఘాలు పాల్గొని విజయవంతం చేయాలన్నారు.

సైబర్ నేరాలపై అవగాహన



అవగాహన కల్పిస్తున్న ఎస్సై శ్రీకాంత్

కాగజ్‌నగర్ టౌన్: కాగజ్‌నగర్ పట్టణంలోని జెడ్పీఎస్ఎస్ పాఠశాల విద్యార్థులకు జిల్లా పోలీసు కళాబృందం ఆధ్వర్యంలో సైబర్ నేరాలు, మాదక ద్రవ్యాలు, బాల్యవివాహాలు, రోడ్డు ప్రమాదాలపై అవగాహన కల్పించారు. అత్యవసర సమయంలో 100కు డయల్ చేయాలన్నారు. యువతలో క్రమశిక్షణ, నైతిక విలువలు, సమాజ సేవా భావన పెంపొందించుకోవాలని ఎస్సై శ్రీకాంత్ అన్నారు. కార్యక్రమంలో కళాబృందం సభ్యులు రోహిత్, రాంచందర్, శ్రీనివాస్, చంద్రశేఖర్, రజిత, విద్యార్థులు పాల్గొన్నారు.

గాలికుంటు నివారణ టీకాలు వేయించాలి




టీకాలు వేస్తున్న డాక్టర్ అంజలి




టీకాలు వేస్తున్న పశువైద్యాధికారి

కౌటాల, చింతలమానెపల్లి: పశుపోషకులు తమ పశువులకు గాలికుంటు నివారణ టీకాలు వేయించాలని పశువైద్యాధికారి అంజలి అన్నారు. శుక్రవారం కౌటాల మండలం తుమ్మిడిహెట్టి గ్రామంలో పశువులకు గాలికుంటు నివారణ టీకాలు వేశారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ.. పశువులకు టీకాలు వేస్తే ఆరోగ్యంగా ఉంటాయన్నారు. రైతులు పశుసంపదను పెంచాలని, ఆరోగ్యంపై శ్రద్ధ చూపాలని సూచించారు. అన్ని గ్రామాల్లో టీకాల కార్యక్రమం కొనసాగుతుందని, రైతులు, పశుపోషకులు సద్వినియోగం చేసుకోవాలని కోరారు. అలాగే చింతలమానెపల్లి మండలంలోని ఆడేపల్లి గ్రామంలో పశువైద్యాధికారి శ్రీకాంత్ పశువులకు టీకాలు వేశారు. కార్యక్రమాల్లో సిబ్బంది కేశవ్, రాజన్న, స్రవంతి, దక్షిణామూర్తి, భిక్షపతి, తదితరులు పాల్గొన్నారు.

సిర్పూర్(టి): మండలంలోని రుద్రారం, ఆరెగూడ గ్రామాల్లో మండల పశువైద్యాధికారి విజయ్ ఆధ్వర్యంలో పశువైద్య సిబ్బంది పశువులకు గాలికుంటు నివారణ టీకాలు వేశారు. రైతులకు, పశుపోషకులు పశువులకు టీకాలు వేయించాలని, ఎలాంటి సమస్యలున్నా పశువైద్యశాలకు తీసుకురావాలన్నారు.



ఆదివాసీ సంప్రదాయ దుస్తులతో మహిళలు



గుస్సాడీ టోపీలకు ప్రత్యేక పూజలు చేస్తున్న పూజారులు

దండారీ సంబరాలు

లింగాపూర్: మండల కేంద్రంలో శుక్రవారం దండారీ సంబరాలు అంబరాన్నంటాయి. గిరిజన సంప్రదాయ పద్ధతిలో ఏత్మసూర్ పేన్ దేవతలకు ఆదివాసీలు ప్రత్యేక పూజలు నిర్వహించారు. వివిధ గ్రామాల నుంచి వచ్చే దండారీ(గుస్సాడీ)లను మహిళలు పూజలు చేసి ఆరాధించారు. యువకులు సాంస్కృతిక వాయిద్యాలు వాయిస్తూ నృత్యం చేశారు.